క్లుప్తంగా

మునిసిపల్ పార్కును సుందరంగా తీర్చిదిద్దండి



పార్కులో ఆట వస్తువులు పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని మిట్టూరు మునస్వామి నాయుడు మునిసిపల్ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను కమిషనర్ అరుణ ఆదేశించారు. మంగళవారం ఆమె పార్కును సందర్శించారు. ప్రహరీ, వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించారు. ఇక్కడున్న ఆట వస్తువులకు మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. పార్కుకు పెయింటింగ్ వేసి, లైటింగ్ కూడా మరమ్మతులు చేయాలని, దీనికి అంచనాలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రమణ, ఏఈ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

37 మందికి కంటి వైద్య పరీక్షలు



తవణంపల్లె: స్థానిక పీహెచ్‌సీలో 37 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో పీఎంఓఏ హరిప్రసాద్ కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దృష్టి సమస్యలు తలెత్తకుండా కళ్ల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోగులను పరీక్షించి కంటి శస్త్ర చికిత్సల కోసం ఏడుగురిని రెఫర్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ హేమలత టీచర్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని బాపినాయుడుపల్లె, దిగువ తడకర పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



ఆవులకు టీకా వేస్తున్న సహాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): లంపీ స్కిన్ వ్యాధి విషయంలో జాగ్రత్తలు పాటించి పాడి పశువులను కాపాడుకోవాలని పశుసంవర్ధకశాఖ సహాయకులు సురేష్ అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలోని మిట్టూరు, దొడ్డి అనంతాపురం, పోతురాజుపల్లెలో మంగళవారం లంపీ స్కిన్ నివారణ టీకాలు వేశారు. మొత్తం 250 దూడలు, ఆవులకు వ్యాక్సిన్లు వేసి పాడి రైతులకు లంపీ స్కిన్ వ్యాధిపై అవగాహన కల్పించారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మంగళవారం చింతగుంటూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, వనజ, ప్రియాంక, సుజాత, కోకిల పాల్గొన్నారు.

దిగువ మారేడుపల్లిలో..

తవణంపల్లె: మండలంలోని దిగువ మారేడుపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైదాధికారి మోహన్‌వేలు రోగులు, గర్భవతులు, బాలింతలను పరీక్షించారు. మందులు అందజేశారు. గర్భిణులు తాజా కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తవణంపల్లె: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

పచ్చ నేతల జేబుల్లోకి 'ఉపాధి'

తెలుగు తమ్ముళ్ల ఒత్తిళ్లతో ఉపాధి హామీ అధికారులు కూలీల కడుపు కొడుతున్నారు. వారి సిఫార్సులకు తలొగ్గి ఫీల్డ్ అసిస్టెంట్లపై కత్తి కట్టారు. పనులను ఆపేశారు. ఫలితంగా కూలీలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. మరోవైపు పనులు కల్పించలేదనే సాకుతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు నోటీసులు ఇస్తున్నారు.

- నేతల ఒత్తిళ్లతో ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు యత్నం
- పనులు నిలుపుదల చేసిన అధికారులు
- ఆపై పనులు కల్పించలేదని అసిస్టెంట్లకు నోటీసులు
- నేతల సిఫార్సులకు జీ హుజూర్ అంటున్న వైనం
- అక్రమ బిల్లులు చేయిస్తామని కుమ్మక్కు



ఉపాధి పనుల్లో కూలీలు (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి, స్థానికంగా పనులు కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తమకు ఆదాయ వనరుగా టీడీపీ నేతలు మార్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమకు అనుకూలురైన వారిని నియమించుకునే దిశగా పావులు కదిపారు. ఓ మండల స్థాయి అధికారిపై ఒత్తిడి తెచ్చి, ఫీల్డ్ అసిస్టెంట్లతో పనులు చేయించడం నిలుపుదల చేయించారు. దీంతో మండలంలోని అనంతాపురం, ఆనగల్లు, గువ్వకల్లు, తాళంబేడు, పాలూరు, ముత్తుకూరు, పెద్దిశెట్టిపల్లె, నాయనిచెరువు, తొప్పాతిపల్లె పంచాయతీల్లో పనులు ఆగిపోయాయి. ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగాలకు ఎసరు పెట్టారు. అలాగే కూలీలు వలసబాట పట్టేలా చేస్తున్నారు.

పని దినాలు లేవని నోటీసులు

పనులను నిలుపుదల చేసి...పని దినాలు కల్పించలేదని నోటీసులు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కక్ష కట్టి కొందరికి మాత్రం నోటీసులు ఇవ్వడంతో టీడీపీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉంటున్నాయో ఇట్టే బోధపడుతోంది. రెండు నెలలుగా పనుల కల్పించడపోవడంతో పనిదినాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. మేలో 17,756 పనిదినాలు, జూన్‌లో 5,424 , జూలైలో కేవలం 2,132 మాత్రమే పనిదినాలు మాత్రమే కల్పించారు. ఈ సంఖ్యను సాకుగా చూపించి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. నోటీసులు ఇచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్ల కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి ఎందుకు ఇవ్వలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బాగోతంపై ఫీల్డ్ అసిస్టెంట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సన్నద్ధులయ్యారు.

పనులు లేక పస్తులు

తొమ్మిది పంచాయతీల్లో ఉపాధి పనులు ఆగిపోవడంతో ఉపాధి కూలీలు కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. పల్లెల్లో ఉపాధి పనులు చేస్తే రోజుకు రూ.150 నుంచి రూ.250 వరకు గిట్టుబాటు అయ్యేది. చిల్లర దుకాణాల్లో ఇంటికి సరిపడా సరుకులను తెచ్చుకునేవాళ్లు. పనులు లేని కారణంగా కూలీలకు అప్పు ఇచ్చే వారు కూడా కరువయ్యారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా రెండు నెలలుగా కడుపుమాడ్చారు.

చిత్తూరు మండలంలో ఉపాధి హామీ వివరాలు

జాబ్‌కార్డుల సంఖ్య : 4,954

మొత్తం కూలీలు : 8,857

మే నెలలో పనిచేసిన కూలీల సంఖ్య : 1201

జూన్ నెలలో పనిచేసిన వారు : 704

జూలైలో పని చేసిన వారు : 324

నిబంధనలకు విరుద్ధంగా..

ఉపాధి పథకం హామీ నిబంధన ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసే వ్యక్తి విధిగా వంద రోజులు పని చేసి ఉండాలి. పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తే వారి స్థానంలో మేట్‌కు అవకాశం కల్పించాలి. అయితే నిబంధనలకు పాతర వేసిన అధికారులు దర్జాగా టీడీపీ కార్యకర్తలకు పోస్టింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈనేపథ్యంలో బేరసారాలు మొదలయ్యాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేరితే కాలువ పని చేయకనే బిల్లులు చేసి పెడతామని నాయకులతో కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేనిపక్షంలో వందరోజులు పని అయ్యేంత వరకు..పనికి రాకపోయినా ఇంట్లో ఉన్న ఒకరి పేరిట పని చేసినట్లు వేతనం వచ్చేలా ఏర్పాటు చేస్తామని లోపాయికారీగా అవగాహనకు వచ్చినట్లు విమర్శలొస్తున్నాయి.

చిత్తూరు మండలంలోని పంచాయతీల వారీగా కల్పించిన పనిదినాలు

పంచాయతీలు	జూన్	జూలై
ఆనగల్లు	58	48
అనంతాపురం	0	33
బీఎన్‌ఆర్‌పేట	8	27
చెర్లోపల్లె	677	309
చింతలగుంట	29	83
దిగువమాసాపల్లె	407	93
గువ్వకల్లు	436	100
కుర్చివేడు	140	151
ముత్తుకూరు	836	183
నాయనిచెరువు	285	91
పచ్చన్నపల్లె	438	179
పాలూరు	532	21
పెద్దిశెట్టిపల్లె	580	120
పెరుమాళ్లకండిగ్ర	338	220
తాళంబేడు	99	240
తొప్పాతిపల్లె	24	11
తుమ్మింద	537	223

రిటైర్డ్ పోలీసులకు ఎస్పీ సన్మానం



చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సయ్యద్ ఖాన్ (ఏఎస్ఐ, చిత్తూరు ట్రాఫిక్), సత్యనారాయణ (ఎస్ఐ, పుంగనూరు)లను ఎస్పీ మణికంఠ ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక పోలీసు అతిథి గృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.రిటైర్డ్ పోలీసులను వారి కుటుంబ సభ్యులతో కలిసి సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీసు శాఖకు అందించిన సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. ఉద్యోగ విరమణ చెందినప్పటికీ ఎలాంటి కష్టం వచ్చినా పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆరీ పుల్లా, ఎస్సీ–ఎస్టీ సెల్ డీఎస్పీ విష్ణు రఘువీర్, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఆర్ఐ భాస్కర్, పోలీసు సంక్షేమ సంఘ అధ్యక్షులు నేతలు ఉదయ్‌కుమార్, పరంధామ నాయుడు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

'వేము'లో నూతన కోర్సులు

పూతలపట్టు: మండలంలో పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా బీబీఏ,, బీసీఏ కోర్సులను ప్రారంభించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపల్ నవీన్ కిలారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోనే అటానమస్ ప్రోగ్రాం ద్వారా కోర్సులు ప్రారంభిస్తున్న ఏకైక కళాశాల తమదేనని, ఈ కోర్సులు ఉద్యోగ శిక్షణకు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించకండి

పూతలపట్టు: విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ ప్రసన్నకుమారి హితవు పలికారు. మంగళవారం మండలంలోని గొడుగుచింత, పోటుకనుమ సచివాలయాలను ఆమె పరిశీలించారు. గొడుగుచింతలో మురుగు నీరు వెళ్లే మార్గం లేక రోడ్డు మీద పిల్ల కాలువలా ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో అధికారులు గ్రామానికి వెళ్లి సమస్యను పరిష్కరించారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోటుకనుమ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసన్నకుమారి

భూ కబ్జా..ఆపై తప్పుడు కేసులు

- న్యాయం చేయాలని బాధితుల వినతి

చిత్తూరు రూరల్(కాణిపాకం): తమ భూములను కబ్జా చేయడంతో పాటు దాడి చేసి తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని యాదమరి మండలం 184 గొల్లపల్లె పేర్లకూరుకు చెందిన వెంకటస్వామి, వరదరాజులు, చంద్రయ్యనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. దాసరాపల్లె పంచాయతీలోని సర్వే నంబరు 258, 258/1, 258/2లో ఒక్కొక్కరికి 1.48 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ తరువాత చంద్రయ్యనాయుడు భాగానికి వచ్చిన 1.48 ఎకరాల భూమిని పార్వతి, పరమేశ్వరి తీసుకుని 2004లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అయితే పేరకూరుకు చెందిన శేఖర్, లోకేష్ కలిసి తమ ఆధీనంలో ఉన్న భూమికి సంబంధించి సర్వే నంబర్లను తారుమారు చేసి కబ్జా చేశారన్నారని, సర్వేయర్ పూర్ణచంద్ర, వీఆర్వో సుబ్బయ్య కబ్జాదారులకు సహకరించి రికార్డులను మార్చారని ఆరోపించారు. పలుమార్లు సంబంధిత మండల అధికారులకు, జేసీకి ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు పూర్తి సాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

ఘనంగా ఆడికృత్తిక వేడుకలు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండపై ఉన్న శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, హోమం, స్వామి, అమ్మవార్ల మూల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజల అనంతరం వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామి వారికి కావడి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు కృష్ణమూర్తి, విశ్వనాథం, వజ్రాలపురం గంగమ్మ ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక మహోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం శ్రీ వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం అనంతరం మహాలంకరణ చేశారు. తదనంతరం ఆలయ ప్రదక్షిణ, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాలభైరవ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్, అర్చకులు శివ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో శ్రీవళ్లీ దేవసేన సమేత స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

అరగొండలో..

తవణంపల్లె: మండలంలో అరగొండలోని శ్రీ స్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో మంగళవారం ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి అభిషేకం అనంతరం సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పలు మండలాల భక్తులు కావడి మొక్కులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అరగొండలో పుష్పపల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. అలాగే తవణంపల్లెలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలోఅభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు కావడి మొక్కులు చెల్లించారు.



అరగొండలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



తవణంపల్లె: కావడి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

– సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : వసతి గృహం విద్యార్థినులు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న ఎస్‌సీ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజ్యలక్ష్మి మాట్లాడారు. వసతి గృహంలో ప్రతి నెలా విధిగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయించాలన్నారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వసతిగృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం హెల్త్ ఆఫీసర్ గుణశేఖర్ వ్యాధులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వార్డెన్ సులోచన, డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీ రాజ్యలక్ష్మి

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఐరాల: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆకాంక్షించారు. మంగళవారం అగరంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజున శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శిక్షా సప్తాహ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్

చిత్తూరు కలెక్టరేట్ : సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన కలెక్టర్‌తో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్యాంకు రుణాలను అర్హులకు విధిగా మంజూరు చేయాలని కలెక్టర్ చైర్మన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ జీఎం ప్రభాకరన్, ఏజీఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు కీలకం

- అభ్యర్థులను గెలిపించుకుందాం
- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఆగస్టు 1న నిర్వహించనున్నారని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను సమష్టి కృషితో గెలిపించుకుందామని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్లు, నాయకులకు సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఎన్నికల బరిలో ఎనిమిది మంది ఉన్నారని, వీరిలో ఐదుగురు సభ్యులు ఎన్నికవుతారన్నారు. తమ పార్టీ తరఫున డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు మధురెడ్డి, శోభ పోటీ చేస్తున్నారని, వారికి మాత్రమే ఓటు వేస్తే సరిపోతుందన్నారు. ఓటింగ్‌లో కార్పొరేటర్లతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు, ఎంపీ ఓటర్లుగా ఉంటారన్నారు. తమకు మొత్తం 24 మంది కార్పొరేటర్లు ఉన్నారని, గురువారం బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరుగుతుందన్నారు. క్రమపద్ధతి ప్రకారం అభ్యర్థుల పేర్లతో కూడిన బ్యాలెట్ పేపర్ నమూనాను ఇవ్వాలని కమిషనర్‌ను కోరామన్నారు. అభ్యర్థుల ఎంపికకు టిక్ లేదా గుర్తు పెడతారని ఆ వివరాలను బుధవారం తెలియజేస్తామన్నారు. ఆగష్టు 1న కార్పొరేటర్లు హాజరై ఓటు వేయాలని కోరారు. సమావేశంలో చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు కేపీ శ్రీధర్, మధురెడ్డి, శోభ, శివ, లక్ష్మణస్వామి, భాగ్యలక్ష్మి, హరిణిరెడ్డి, రేఖ, ఉన్ని, చల్లాముత్తు, ఆను, అల్తాఫ్, శారద, మనోహర్‌రెడ్డి, శిరీష్‌రెడ్డి, అన్బు మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్ , హాజరైన కార్పొరేటర్లు, నాయకులు